క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

నర్మెట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ టి. శరత్ తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు, ఫిబ్రవరి 22 లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యను బోధించడం జరుగుతుందని, ఆసక్తి గల విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17వ వార్డు సందర్శన



జనగామ: పట్టణంలోని 17వార్డును ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే పరిసరాలను పరిశీలించారు. కాలనీ సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చూస్తామని చెప్పారు.

నేడు చెక్కుల పంపిణీ

పాలకుర్తి: లబ్ధిదారులకు మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పంపిణీకి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించనున్నట్లు చెప్పారు.

నేడు సర్వసభ్య సమావేశం

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (సోమవారం) మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ బావండ్ల నాగజ్యోతికృష్ణంరాజు తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు నిర్వహించే మండలసభకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, పలు శాఖల అధికారులు హాజరవుతున్నారని అన్నారు. అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

నేడు ఘన్‌పూర్ మండల ..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు(సోమవారం) నిర్వహించనున్నట్లు ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీధర్ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు రఘునాథపల్లి ..

రఘునాథపల్లి: మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని రైతు వేదికలో ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎండీ హసీం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకాగలరని ఆయన కోరారు.

రైతులకు అందుబాటులో యూరియా

బచ్చన్నపేట: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో, సొసైటీల్లో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, దిగులు చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి చేరుపల్లి విద్యాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ యూరియా దొరకదనే అపోహలు మానుకోవాలని, మండల కేంద్రంలోని శివశంకర్, బాలాజీ, ఎస్‌వీ ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్సై మహేందర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మంచాల ఎల్లయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి కోరారు. గ్రావిడ్ హోం ఆస్పత్రి హనుమకొండ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు దీపా, హిమబిందు, భార్గవి, పావని, ఎం సోమనారాయణ, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంచాల అనిల్ పాల్గొన్నారు.

నివాళి

పాలకుర్తి టౌన్: నియోజకవర్గ కేంద్రానికి చెందిన చిలువేరు సోమయ్య గుండె పోటుతో ఆదివారం మృతి చెందాడు. కాగా, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గడ్డం యాకసోమయ్య, బైరు బార్గవ్, పసునూరి నవీన్, పుస్కూరి శ్రీనివాస్‌రావు, సర్పంచ్ వీరమనేని యాకాంతరావు ఉన్నారు.

నత్తనడకన రోడ్డు పనులు

- కంకరపోసి వదిలేసిన కాంట్రాక్టర్
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



కంకరపోసి వదిలేసిన రోడ్డు

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లి నుంచి వీరారెడ్డితండా వరకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లో రూ. కోటి 45 లక్షల నిధులతో చేపట్టిన రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. సగం వరకు కంకర పోసి వదిలేయడంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో గుంతల రోడ్డుతో ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రత్యేక చొరవతో బీటీ రోడ్డు మంజూరైంది. ఇందులో 2 కిలోమీటర్ల మేర బీటీ, ఒక కాజ్‌వే, 3 కల్వర్టులు వేయాలి. 2023 సెప్టెంబర్ 17న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ మట్టి రోడ్డుపై కంకర పరిచి రెండు నెలలు గడిచినా రోలింగ్ చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పోసిన కంకర్‌పై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని పనులు వేగవంతంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఐటీడీఏ ఏఈ పుల్లయ్యను వివరణ కోరగా ఈ రోడ్డుపై బీటీ వేసేందుకు నిధులు కావాల్సి ఉంది. అందుకు ప్రతిపాదనలు పంపాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కంకర్‌పై డస్ట్ పోసి రోలింగ్ చేపిస్తామని పేర్కొన్నారు.

కంకరతో తీవ్ర ఇబ్బందులు



బీటీ రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మూడు నెలల క్రితం కంకర పోసి వదిలేయడంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు వెంటనే కొనసాగేలా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

- రావుల చంద్రారెడ్డి, అశ్వరావుపల్లి

ఉన్నతాధికారులు స్పందించాలి



గ్రామం నుంచి వీరారెడ్డితండాకు వెళ్లేందుకు కంకర రోడ్డుపై ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బంది, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే శ్రీహరి దృష్టికి తీసుకెళ్లా. ఉన్నతాధికారులు స్పందించి పనులు వెంటనే చేపట్టాలి.

- తూముకుంట్ల సురేందర్‌రెడ్డి, సర్పంచ్

'సెయింట్ పాల్స్'లో సిల్వర్‌జూబ్లీ వేడుకలు



సిల్వర్‌జూబ్లీ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా, ఉడుముల బాల, డీఈఓ రాము



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

- ముఖ్యఅతిథులుగా హాజరైన వరంగల్ డయాసిస్ ప్రెసిడెంట్ బిషప్ ఉడుముల బాల, ఎమ్మెల్యే పల్లా

జనగామ: జిల్లా కేంద్రం నెహ్రూపార్కు ఏరియా సెయింట్ పాల్స్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 1999లో స్థాపించిన పాఠశాల అంచెలంచెలుగా ఎదుగుతూ.. 25 వసంతంలో అడుగిడుతున్న వేళ సంబురాలు అంబరాన్నంటాయి. సామాన్య బడిగా ప్రయాణం మొదలు పెట్టిన సెయింట్ పాల్స్ అనేక మైలు రాళ్లను దాటుకుంటూ నేడు జిల్లా కేంద్రంలో పిల్లల బంగారు భవిష్యత్‌కు దారి చూపిస్తోంది. జూబ్లీ, వెల్కం డాన్స్‌లతో వేడుకలు ప్రారంభం కాగా, ముఖ్య అతిథులుగా వరంగల్ డయాసిస్ ప్రెసిడెంట్ బిషప్ ఉడుముల బాల, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, గౌరవ అతిథులుగా డీఈఓ కె.రాము, మున్సిపల్ చైర్ పర్సన్ జమునలింగయ్య, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ పాఠశాలను అద్భుతంగా నడిపిస్తూ ఒక మైలు రాయిని దాటిస్తున్న యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. పాఠశాలలో ఉన్నతమైన క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన చేయడం సంతోషకరమన్నారు. అనంతరం ఉడుముల బాల మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం నేర్పిస్తూ, పిల్లల భవిష్యత్‌కు పునాది కావాలన్నారు. 25 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థుల కుటుంబాలకు నమ్మకంగా మారి, విద్యారంగంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకోవడం గర్వకారణమన్నారు. నర్సరీ, ఎల్‌కేజీ విద్యార్థులు నృత్యం ఆద్యంతం ఆకట్టుకుంది. అంకితభావంతో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎండి. సర్దార్ ఖాన్, టి.ప్రవీణ్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే, ఉడుముల బాల, అతిథులను యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించింది. మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌మేకల రాంప్రసాద్, కౌన్సిలర్ బండ పద్మయాదగిరిరెడ్డి, ఫాదర్‌లు ఎం. జయపాల్, టి. అగస్టీన్ రెడ్డి, ఆర్. ఇన్నారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ మరియా జోసెఫ్ పాల్గొన్నారు.

యూత్, కాంగ్రెస్ కమిటీల ఎన్నిక



12వ వార్డు నూతన కాంగ్రెస్, యూత్ కమిటీ సభ్యులు

జనగామ: పట్టణంలోని 12వ వార్డు యూత్, కాంగ్రెస్ కమిటీలను ఎన్నుకున్నారు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు వార్డు ఇన్‌చార్జ్ శ్రీరాం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో యూత్ అధ్యక్షుడిగా బత్తిని వెంకటేష్, కార్యదర్శిగా బిట్ల నాగేంద్ర బాబు కోశాధికారిగా పాశికంటి వెంకటేష్, పార్టీ అధ్యక్షుడిగా వంగ యుగేందర్, కార్యదర్శిగా బొంతపల్లి వెంకటేష్, కోశాధికారిగా కాముని సమ్మయ్యలను ఎన్నుకున్నారు.

అంకుషాపూర్ గ్రామ..



ఎం.భిక్షపతి అధ్యక్షుడు

తరిగొప్పుల: మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ వగలబోయిన యాదగిరి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ యాకూబ్ పాషా ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మదాసు భిక్షపతి, ఉపాధ్యక్షులుగా కొయ్యడ శ్రీను, ముక్కెర విద్యాసాగర్, గౌరవ అధ్యక్షుడిగా కత్తుల సాయిరెడ్డి, సలహాదారులుగా ముక్కెర ఐలయ్య, చిన్నముత్తి యాదగిరి, ఎర్రోజు భిక్షపతి, పోగుల దామోదర్, పిల్లెల ప్రభాకర్, నాగపూరి భూపాల్, పోగుల మల్లేషం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బట్టు మహేందర్‌రెడ్డి, పైసా ప్రేమ్‌కుమార్, బైకని బాల్‌రాజ్,మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కన్నెబోయినగూడెం గ్రామ కమిటీ

నర్మెట: రానున్న పార్లమెంట్, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని కన్నెబోయినగూడెం, వెల్దండలలో ఆదివారం గ్రామ శాఖల కమిటీల ఏర్పాటు సందర్భంగా ఆయన మాట్లాడారు. కన్నెబోయినగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడిగా పానబోయిన బాలనర్సు, యూత్ అధ్యక్షుడిగా గోల్కొండ శివకుమార్, మహిళా అధ్యక్షురాలిగా ధరావత్ లక్ష్మి, వెల్దండ అధ్యక్షుడిగా గోల్కొండ నర్సింహులు, యూత్ అధ్యక్షుడిగా మార్క మహేష్, మహిళా అధ్యక్షురాలిగా ఆగమల్ల పద్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



కొడకండ్ల: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నిక కోసం మండలంలో అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఓటు వేసిన వారితో పాటు ప్రస్తుతం అర్హులైన వారు కూడా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో కాని ఫారం 18 సమర్పించి ఫిబ్రవరి 6వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సోమ నర్సయ్య, రమేష్, భిక్షపతి, శ్రీవర్ధ, మనోహర్, కదారి శివరాములు, వంశీకృష్ణ, హరగోపాల్‌గౌడ్, కనకయ్య పాల్గొన్నారు.

న్యాయం చేయండి

లింగాలఘణపురం: తన ప్లాటును ఆక్రమిస్తున్న వారి నుంచి న్యాయం చేయాలని కోరుతూ రామచంద్రగూడేనికి చెందిన గంగుల ప్రభాకర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 50 ఏళ్ల క్రితం తన తండ్రి మల్లారెడ్డి కొనుగోలు చేసిన 400 గజాల స్థలంలో గంగుల విజయ ఇల్లు కట్టుకొనేందుకు అనుమతికి దరఖాస్తు చేసుకున్నారని, సర్వే నంబర్ 83/ఎ/2లో పూర్తిగా ఇళ్లు, సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకులు ఉన్నాయని, అట్టి భూమిని 22 గుంటలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని నాలా అనుమతి తీసుకొని ఇంటి నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అడ్డుకొని న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సత్కారం



సన్మానం పొందిన సర్పంచ్, వార్డు సభ్యులు

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, నీలం భాస్కర్, సుధాకర్‌రెడ్డి, రంగు శ్రీను, చెరుకు రవిల ఆధ్వర్యంలో ఆదివారం సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల సేవలు ఆదర్శనీయమన్నారు. ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామాభివృద్ధితో పాటు, గ్రామస్తులకు వీధిలైట్లు, పారిశుద్ధ్య నివారణ, సీసీ రోడ్లు, తాగు నీటి సమస్య తీర్చడంతో విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యడ మల్లేష్, ఉప సర్పంచ్ సింగిరెడ్డి తిరుమల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయిబాబా వార్డు సభ్యులు లావణ్య, యాదలక్ష్మి, బాలనర్సు, సుగుణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిల్పూరు: నాటిఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్: చాగల్లులో..

చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, మాచర్ల శ్రీనివాస్, మూల నాగరాజు, నారగోని రవి, సోమ రవి, రంజింత్, రవి, శ్రీధర్, శ్రీకాంత్, ఉమ పాల్గొన్నారు.

చాగల్లులో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని చాగల్లు గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ 2005–06 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాల ఆవరణ వేదికగా ఒకే చోట కలిసి సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు. సదానందచారి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



జనగామ: డ్రైయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జమున

జనగామ: పట్టణంలోని 27వ వార్డులో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించ తలపెట్టిన డ్రైయినేజీ నిర్మాణ పనులను ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య ప్రారంభించారు. కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వార్డు గౌరవ సభ్యులు అర్గుల శ్రీనివాస్, బచ్చు రమేష్, ద్వారక దాస్ బజాజ్, గోవిందు లోయ, శ్రీమాన్ పాల్గొన్నారు.

జీపీ భవనం..



చిల్పూరు: గత ఐదేళ్లుగా గ్రామ అభివృద్ధికి ప్రజలు తనకు అందించిన సహకారం అభినందనీయమని, అధికారంలో లేకున్నా గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామని సర్పంచ్ పుట్ట అంజనీరవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో ఆదివారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామ సమీపంలోని శ్మశాన వాటికను వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఉప సర్పంచ్ సాదం రాజు, సభ్యులు పోలు స్వరూపసంపత్, సాదం రేణుకలింగయ్య, స్వరూపసాంబరాజు, సమ్మక్కసాంబరాజు, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బోర్ పనులు..



లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట వైఎస్ఆర్ కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.5.70 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదివారం సర్పంచ్ జయరాజేశ్వర్ భూమిపూజ చేశారు. కాలనీలో మంచినీటి సౌకర్యార్థం బోరుమోటర్, అండర్ డ్రెయినేజీ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సిద్ధు, నాయకుడు నాగేందర్, ఉపసర్పంచ్ కుమార్, శ్రీనివాసు, రాజు, నరేందర్, వెంకన్న, చంద్రమౌళి, కృష్ణ, రాములు, రవికుమార్, మల్లేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సర్పంచ్ బూడిద జయరాజేశ్వర్‌లకు గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పదవీ విరమణ వీడ్కోలు సన్మానం చేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే బహుమతులు



బహుమతులను అందజేస్తున్న శ్రీధర్‌రావు

చిల్పూరు: గ్రామంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే తన తండ్రి పొట్లపల్లి చక్రధర్‌రావు జ్ఞాపకార్థం నగదు బహుమతులను అందజేస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్ట గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారులకు ఇటీవల చక్రధర్‌రావు స్మారకార్థం పోటీలను నిర్వహించారు. కాగా గెలుపొందిన జట్లకు ఆదివారం షీల్డులతో పాటు రూ. 5 వేల నగదును అందజేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, శ్యాంసుందర్‌రెడ్డి, ఆనందం, రమేష్, అశోక్‌పాల్, రాములు, రత్నాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

పాలకుర్తి: ఏఐసీసీ కోఆర్డినేటర్, పశ్చిమ బెంగాల్ ఓబీసీ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి తల్లి తిరుపతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, నర్సంపేటలో ఆయన స్వగృహంలో నియోజకవర్గం నాయకులు ఆదివారం ఆయనను పరామర్శించి తిరుపతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకుడు ఉల్లెంగుల యాదగిరి, పులి గణేష్, వట్టికూత రామారావు, నలమాస రమేష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన పోలోజు సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు గ్రామ మేస్త్రీల సంఘం సభ్యులు రూ.3వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నరామన్‌చర్లలో..

చిన్నరామన్‌చర్లలో మృతి చెందిన కొమ్మరాజుల మల్లేష్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకుడు ఎండి.ఆజామ్ 50 కిలోల బియ్యం అందించారు. నాయకులు కిష్టయ్య, ఉప్పలయ్య, ఐలయ్య తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు గ్రామానికి చెందిన శ్రీరాముల నరేష్ (45) ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎండీ అజీమ్, పులి సోమయ్య, వాసం యాకయ్య, పింగిలి సోమయ్య బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఘన్‌పూర్ సీఐ సట్ల రాజుగౌడ్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సీఐ రాజుగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి ఫైన్‌లు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం సేవించి ఎవ్వరూ వాహనాలు నడపొద్దని, తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనల్ని పాటించాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇంటింటా భగవద్గీత ప్రచారం



భగవద్గీత గ్రంథం అందిస్తున్న సభ్యులు

కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామంలో ఆదివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక భువనగిరి, తొర్రూరు, చేర్యాల కమిటీల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు భగవద్గీతలను అందించారు. అనంతరం హిందూత్వంలోని సాంప్రదాయాలు, పండుగల ఆచరణలో జ్ఞానార్థములను వివరించారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర, సుధాకర్, పంచాక్షరి, లావణ్య, జయమ్మ, లత, రాణి, లక్ష్మీనారాయణ, సాయిరాజ్, అశోక్, లింగస్వామి, నరేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సొసైటీ భవనాలు



వెంకటాద్రిపేట సొసైటీ భవనం



శ్రీపతిపల్లిలో..



చిల్పూరులో..

చిల్పూరు: ఒకప్పుడు రైతుల సమావేశాలతో, ధాన్యంతో కళకళలాడి విశాల మైన స్థలాల్లో ఉన్న సొసైటీ భవనాలు నేడు శిథిలావస్థకు చేరాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా వినియోగంలోకి తెచ్చేనా అని రైతులు ఎదురు చూస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ పరిధిలో స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెం, తాటికొండ, మీదికొండ, చిల్పూరు, వెంకటాద్రిపేట, శ్రీపతిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో సొసైటీ భవనాలున్నాయి. ప్రస్తుతం ఘన్‌పూర్, ఇప్పగూడెం మినహా అన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని చోట్ల దర్వాజలు, కిటికీలు ఎత్తుకెళ్లారు. ఇప్పటికైనా పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిర్ర నాగరాజులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి భవనాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చేలా కృషిచేయాలని రైతులు కోరుతున్నారు.